క్లుప్తంగా

ఎన్ఏఎస్‌పై అవగాహన



అయిజ: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో సోమవారం నేషనల్ అచ్యూవ్‌మెంట్ సర్వే (ఎన్ఏఎస్)పై ఎన్ఏఎస్‌కు ఎంపికైన పాఠశాలల హెడ్‌మాస్టర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పల కాంప్లెక్స్ జీహెచ్ఎం బలరాం మాట్లాడుతూ.. డిసెంబర్ 4న నిర్వహించనున్న ఎన్ఏఎస్ పరీక్షల విధి విధానాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ రాములు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పందులకు టీకాలు తప్పనిసరి



శాంతినగర్ : పందులకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని శాంతినగర్ పశుసంవర్ధకశాఖ వైద్యురాలు పుష్పలత సూచించారు. వడ్డేపల్లి మున్సిపాలిటీ శాంతినగర్‌లోని పైపాడు మిట్టలవద్ద సోమవారం పందులకు టీకాలు వేసే కార్యక్రమం చేపట్టారు. పందులు పెంచుతున్న వారి ఇళ్ల వద్దకు వెళ్లి టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పందులు వ్యాధుల బారిన పడకుండా టీకాలు వేయించాలని యజమానులకు సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పగటి వెలుగులు.. పట్టించుకోరెవరూ



గద్వాల(మల్దకల్) : మండలంలోని వివిధ గ్రామాల్లో పట్టపగలే వీధి దీపాలు వెలుగుతున్నా ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. విద్యుత్ అధికారులు వీధిదీపాలకు ఆఫ్ఆన్ స్విచ్‌లు ఏర్పాటు చేసిన కార్యదర్శులు వాటి నిర్వాహణపై శ్రద్ధ చూపడం లేదని తెలిపారు. మరికొన్ని గ్రామాల్లో వీధి దీపాలు కాలిపోయినా పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు విద్యుత్ దీపాల వాడకంలో తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అలంపూర్‌లో రంగరాజన్ ప్రత్యేక పూజలు



అలంపూర్ : దక్షిణ కాశీ అలంపూర్ క్షేత్ర ఆలయాలను చిలుకూరి బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు సీహెచ్ రంగరాజన్ సోమవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ ఈఓ పురేందర్ కుమార్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు శ్రీజోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈఓ వారిని శేషవస్త్రాలతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

సద్దలోనిపల్లిలో బైక్ చోరీ

గద్వాల(మల్దకల్): మండలంలోని సద్దలోనిపల్లి గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలంలో కుర్వగొల్ల రాముడుకు చెందిన బైక్‌ను ఉంచగా గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌ను అపహరించినట్లు బాధితుడు మల్దకల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వ్యవసాయ పొలాలు, ఇంటి పరిసరాల్లో వరుస బైక్‌ల చోరీతో వాహనదారులు భయాందోళనలో ఉన్నారు.

యాసంగి వరి సాగుపై అవగాహన

వీపనగండ్ల: యాసంగి వరి సాగులో భాగంగా రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించేందుకు మంగళవారం మండల కేంద్రంలో రైతు నేస్తం కార్యక్రమంలో దృశ్య, శ్రవణ పరికరాల ద్వారా అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు మండల వ్యవసాయ అధికారి డాకేశ్వర్‌గౌడ్ తెలిపారు. మండల కేంద్రంలో ఉదయం 11 గంటలకు రైతువేదికలో ఈ అవగాహన కార్యక్రమం ప్రారంభమవుతుందని, రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

గద్వాల : ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, కేజీబీవీల్లో విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యుడు చారుకొండ వెంకటేష్ అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సోమవారం డీఈఓ అబ్దుల్ ఘనితో కలిసి తనిఖీ చేశారు. తరగతి గదులు, వంటశాల, స్టోర్ రూం, వాష్‌రూమ్‌లను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆదేశించారు. అనంతరం ఉపాధ్యాయుల బోధన తీరు పరిశీలించారు. విద్యార్థులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

అలంపూర్ : గురుకుల పాఠశాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని బీసీ బాలుర గురుకుల పాఠశాలను ఎమ్మెల్యే సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గదుల్లో లైట్లు, ఫ్యాన్లు లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలన్నారు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాన్నారు. కార్యక్రమంలో కలుగోట్ల పీఏసీఎస్ అధ్యక్షుడు గజేందర్ రెడ్డి, నాయకులు కిషోర్, వెంకట్రాముడు, శ్రీను, బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



అలంపూర్ గురుకుల పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

గద్వాల(కేటీదొడ్డి): మండలంలోని కొండాపురం పాఠశాలను సోమవారం ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు సందర్శించారు. ఈ సందర్భంగా బోధన తీరుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. అనంతరం పాఠశాల రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో సీఆర్‌పీ యుగంధర్, పాపయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



కొండాపురంలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు



గద్వాల కస్తూర్బాలో విద్యా కమిషన్ సభ్యుడు వెంకటేష్

ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల గడువు పెంపు

గద్వాల(గట్టు) : ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల గడువు పెంచినట్లు ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్, గట్టు హైస్కూల్ హెచ్ఎం నల్లారెడ్డి తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి ఎస్ఎస్‌సీ, ఇంటర్ ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్లకు అపరాధ రుసుముతో ఈ నెల 11 వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు.

అయిజ: ఓపెన్ ఎస్ఎస్సీ, ఇంటర్ 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్లకు గడువు పొడగించినట్లు కోఆర్డినేటర్ రాములు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అపరాధ రుసుముతో అడ్మిషన్ ఫీజును ఆన్‌లైన్‌లో, మీసేవా కేంద్రాల్లో చెల్లించచ్చని సూచించారు. రసీదులను మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో అసిస్టెంట్ కోఆర్డినేటర్ తిమ్మప్పకు అందజేయాలని పేర్కొన్నారు.

శాంతినగర్: ఓపెన్ ఎస్ఎస్‌సీ, ఇంటర్ (టాస్) అడ్మిషన్లు ప్రారంభమైనట్లు శాంతినగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జీహెచ్ఎం వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గోపుర కళశాల వితరణ



మల్దకల్ : ఆదిశిలా క్షేత్రం స్వయంభూ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవాలయ గోపురాలకు మల్దకల్‌కు చెందిన దాతలు రూ.లక్ష విలువ చేసే 10 కళశాలను వితరణ చేశారు. మల్దకల్‌కు చెందిన సింగనేడి ఈరమ్మ బూదయ్యల జ్ఞాపకార్థం వారి కుమారులు జ్యోతి నర్సింహయ్య, పావని నర్సింహ్మయ్యలు సోమవారం ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, అర్చకులకు కళశాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు రమేషాచారి, నరేందర్‌శెట్టి, కృష్ణ, నరేందర్ గౌడ్, చంద్రశేఖర్‌రావు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



వనపర్తి రూరల్: జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగిన 'పునరుత్పాదక శక్తి వనరులు' అనే అంశంపై జరిగిన వ్యాస రచన పోటీలో మండలంలోని చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి బి పవన్ మండల స్థాయిలో మొదటి బహుమతి, జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతిని అందుకున్నాడు. సోమవారం హెచ్ఎం గణేష్‌కుమార్ అధ్యక్షతన పాఠశాలలో జరిగిన సమావేశంలో ఉపాధ్యాయులు భౌతిక శాస్త్ర ఉపాధ్యాయిని రుద్రమదేవి, గణితశాస్త్ర ఉపాధ్యాయులు సి వరదాచారిని, విద్యార్థి పవన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రశేఖర్, జిల్లా చెలిమి సంస్థ అధ్యక్షుడు రవి తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ యూటీఎఫ్ సభ్యత్వ నమోదు

అయిజ: మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల వద్ద మంగళవారం టీఎస్ యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆ సంఘ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా 60 మంది ఉపాధ్యాయులు సభ్యత్వం చేశారు. టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిప్పన్న మాట్లాడుతూ.. ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని కోరారు. 317 మంది బాధితులకు న్యాయం జరిగే విధంగా నూతన పీఆర్‌సీని ప్రకటించాలని, కేజీబీవీలో పనిచేసే సీఆర్‌టీలకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 8న అలంపూర్‌లో నిర్వహించనున్న జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా బాధ్యులు లక్ష్మన్న, సుధాకర్, ప్రశాంత్, సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.



సభ్యత నమోదు కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

మినీ వంతెనలు నిర్మించాలి



కొర్విపాడు స్టేజికి వెళ్లే మార్గంలో బురదలో ఇరుకున్న ట్రాక్టర్

- నిత్యం ఇబ్బందులు పడుతున్న రైతులు
- ఏళ్లు గడుస్తున్న పట్టించుకోని నాయకులు

మానవపాడు: హామీలు ఎన్నికల రోజు వరకే పరిమితమవుతున్నాయి. ఎన్నికల వేళ గ్రామాల్లో నాయకులు హామీలు ఇస్తారూ... వెళ్తారూ రోడ్లు, వంతెనలు నిర్మిస్తామన్నా మాటలు నీటి మూటలుగానే ఉన్నాయి. మండలంలోని చెన్నిపాడు, గోకులపాడు గ్రామాల్లో మినీ వంతెనలు నిర్మించాలని ఎన్నో మార్లు నాయకులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. వర్షకాలమే కాదు ఏ కాలమైనా గ్రామాల్లో మిని వంతెనాలు నిర్మించకా తీవ్ర ఇబ్బందులను పడుతున్నామని తెలిపారు.

బురుదలో ఇరుక్కుపోతున్న వాహనాలు..

గ్రామాల్లో వంతెనాలు లేక వాగుల్లో బురదలో వాహనాలు ఇరుక్కుని అవస్థలు పడుతున్నారు. మండలంలోని చెన్నిపాడు, గోకులపాడు గ్రామాల ప్రజలు కొర్విపాడు, చంద్రశేఖర్‌గనర్ గ్రామాల్లోని శివారు ప్రాంతాల్లో పొలాలకు వెళ్లాలంటే వంతెనాలు లేక నిత్యం రాకపోకలకు అవస్థలు తప్పడం లేదంటున్నారు. పంటలు వ్యవసాయ పొలాల నుంచి తరలించాలంటే అవస్థలు పడుతున్నామని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి మినీ వంతెనలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు..

ఆత్మకూర్: ప్రజాసంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముందుకెళ్తున్నారని మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. సోమవారం ఆత్మకూర్‌లోని ఎంపీడీఓ కార్యాలయంలో 32 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, ఇద్దరికి షాదీముబారక్, 25 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్ని నేరవేరుస్తున్నామని, రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, ధాన్యం కొనుగోళ్లలో రూ. 500 బోనస్, అలాగే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ.500లకు వంటగ్యాస్, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లాంటి పథకాలను అందిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయని, ఇదివరకే రూ.65 కోట్లతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు వెల్లడించారు. అభివృద్ధిని విస్మరించిన గత పాలకులు ప్రభుత్వంపై బురదజల్లడమే లక్ష్యంగా పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ చాంద్‌పాష, ఎంపీడీఓ శ్రీరాంరెడ్డి, చైర్‌పర్సన్ గాయత్రి, విండో అధ్యక్షుడు కృష్ణమూర్తి, నాయకులు పరమేష్, రహ్మతుల్లా, తులసీరాజ్, తుకారాం, చిరంజీవీ, వినయ్‌రెడ్డి, రామలక్ష్మారెడ్డి, మణివర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూర్‌లో లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

కార్యకర్తలకు అండగా..

బాలకిష్టాపూర్ గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు చిన్నచాంద్ ఇటీవల అనారోగ్యానికి గురై మంచానికే పరిమితమయ్యారు. దీంతో బాధితుడిని ఆయన ఇంటికెళ్లి ఎమ్మెల్యే పరామర్శించారు. ఆపదలో ఉన్న కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని, మెరుగైన వైద్యచికిత్సలకు సహకరిస్తానని భరోసానిచ్చారు.

మెరుగైన వైద్యం అందించాలి

గద్వాల(ధరూరు) : ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పూర్తి స్థాయిలో నిధులు కేటాయించి పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని సీపీఎం జిల్లా కమిటీ నాయకుడు ఉప్పేరు నర్సింహ అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఉప్పేరు పీహెచ్‌సీ, నెట్టెంపాడు గ్రామంలోని పల్లె దవాఖానాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో సౌకర్యాలు, తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రులకు నిధుల కేటాయింపులు లేకుండా వైద్యం అందించడం సాధ్యం కాదని, ప్రభుత్వం రోగులను దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన మందులు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మోష, తిమ్మప్ప, రామాంజనేయులు, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఉప్పేరు పీహెచ్‌సీలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కమిటీ నాయకుడు నర్సింహ

ఏకాగ్రతతో పఠిస్తే విజయం తథ్యం

గద్వాల : విద్యార్థులు ఏకాగ్రతతో పఠిస్తే విజయం సాధించవచ్చని జీహెచ్ఎం ఇమ్మానియేల్ అన్నారు. చిమ్మపూడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పద్య పఠన పోటీలు నిర్వహించారు. విద్యార్థులు నేర్చుకున్న పద్యాలను రాగ, భావయుక్తంగా ఆలపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు నిరంతరం శ్రమించాలన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులను ప్రోత్సహించినప్పుడే మరింత ముందుకు వెళ్తారన్నారు. జూనియర్స్ విభాగంలో స్టీవెన్సన్, నితీష్, సీనియర్స్ విభాగంలో రంజిత్, బాలు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రేణుక, అయ్యన్న, అంబటి భాను ప్రకాష్, మోహన్ రావు, యాస్మిన్, రాజేశ్వరి, తాయన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

మానవపాడు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఎంఈఓ శివ ప్రసాద్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రజా పాలనలో భాగంగా పునరుత్పాదక శక్తి వనరులు అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యాస రచన పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించి వారిని జిల్లా స్థాయికి ఎంపికచేస్తామన్నారు. ప్రతి విద్యార్థి ఉత్తమ ప్రదర్శన కనబర్చి జిల్లా స్థాయిలో గెలుపొందాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్ కోసం విరాళాలు

గద్వాల(గట్టు) : తమ పిల్లల భవిష్యత్ కోసం గ్రామస్తులు ఏకమై విద్యా వాలంటీర్లకు విరాళాలు అందజేస్తున్నారు. ఆరగిద్ద ఉన్నత పాఠశాల హెచ్ఎం జహీర్‌బేగ్‌కు గ్రామానికి చెందిన బాలకృష్ణారెడ్డి సోమవారం ఈ నేపథ్యంలో విరాళం అందజేశారు. ఉపాధ్యాయుల కొరత నేపథ్యంలో వాలంటీర్లను ఏర్పాటు చేసుకునేందుకు ఆరగిద్ద గ్రామస్తులు స్కూల్ హెచ్ఎంకు విరాళం అందజేస్తున్నారు. గ్రామస్తులు అందిస్తున్న విరాళంతో పాటుగా ఉపాధ్యాయులు కూడా కొంత మేరకు డబ్బులను పోగు చేసుకుని ఇద్దరు వాలంటీర్లను ఏర్పాటు చేసుకున్నారు. ఆరగిద్ద ఉన్నత పాఠశాలలో మొత్తం 260 మంది విద్యార్థులు చదువుకుంటుండగా, కేవలం నలుగురు రెగ్యులర్ ఉపాధ్యాయులు మాత్రమే పని చేస్తున్నారు. దీంతో విద్యార్థులకు ఇబ్బంది లేకుండా గ్రామస్తులు అందిస్తున్న విరాళంతో పాటుగా ఉపాధ్యాయులంతా కలసి డబ్బులను జమ చేసుకుని వాలంటీర్లను కొనసాగిస్తున్నారు.



ఆరగిద్దలో ఉపాధ్యాయులకు విరాళం అందజేస్తున్న గ్రామస్తులు

కలెక్టరేట్‌లో ఆత్మహత్యాయత్నం సిగ్గుచేటు

గోపాల్‌పేట: కాంగ్రెస్ పార్టీ హయాంలో రైతు కలెక్టర్ కార్యాలయంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం సిగ్గుచేటని గోపాల్‌పేట మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బాల్‌రాజు అన్నారు. సోమవారం సాయంత్రం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ అధికారులు రైతు సమస్యను పట్టించుకోకపోవడం వల్లనే ఈ ఘటన జరిగిందని కాంగ్రెస్ పార్టీ సిగ్గుపడాల్సిన విషయమన్నారు. కార్యక్రమంలో తిరుపతియాదవ్ వెంకటేష్వర్‌రావు, శంకరయ్య, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సమాజహితం కోరే విద్య అందించాలి

అమరచింత: సమాజహితం కోరే విధంగా నేటి విద్యా ప్రమాణాలు ఉండాలని, అలాంటి విద్యను విద్యార్థులకు అందించేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలని రిటైర్డ్ డీఈఓ విజయ్‌కుమార్ అన్నారు. సమాజ హితం కోరుతూ పాదయాత్రను నిర్వహిస్తూ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాల, కేజీబీవీని సందర్శిస్తూ నేటి విద్యా విధానాలు, సమాజంలోని మార్పుల గురించి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. పాదయాత్రలో భాగంగా సోమవారం అమరచింత జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో 100 రోజుల పాటు 1000 కిలోమీటర్ల మేరకు పాదయాత్రను నిర్వహిస్తున్నామన్నారు. అక్టోబర్ 2న జోగులాంబ గద్వాల జిల్లా నుంచి పాదయాత్ర మొదలైందని, ఈనెల 12 ఉమామహేశ్వర ఆలయానికి చేరుకుని అక్కడ ముగుస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ భాస్కర్ సింగ్, పాఠశాల హెచ్ఎం కృష్ణవేణి, కేజీబీవీ ఎస్ఓ స్వప్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రిటైర్డ్ డీఈఓ వినయ్‌కుమార్

వైభవంగా నందికోళసేవ



ఉండవెల్లిలో ప్రత్యేక అలంకరణలో వీరభద్రస్వామి



క్యాతూర్‌లో నందికోళ ఉత్సవంలో భక్తులు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని శివాలయంలో పరమశివునికి భక్తులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం చంద్రశేఖరయ్య ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేశారు. అనంతరం అర్చకులు శాంతయ్య వీరభద్రునికి ప్రత్యేక అలంకరణతో పూజలు చేశారు. రాత్రి 9 గంటల నుంచి మంగళవారం ఉదయం 6 గంటల వరకు నందికోల సేవ నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు, రైతు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అలంపూర్ : మండల పరిధిలోని క్యాతూర్ గ్రామంలో నంది కోల సేవ ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారుర. హరిహర దేవాలయం, శ్రీ నీలకంఠేశ్వర స్వామి సన్నిధిలో కార్తీక మాసం ముగింపులో భాగంగా అమావాస్యను పురస్కరించుకుని శ్రీవీరభద్రేశ్వర స్వామి నంది కోల సేవ చేశారు. వీరభద్ర స్వామి ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలోని పురవీధులు గుండా ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో నంది కోల సేవ చేస్తూ భక్తిని చాటుకున్నారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు ఆదివేశ్వర స్వామి, మహేశ్వరయ్య స్వామి, సదా శివయ్య స్వామి, కమలాకర్, గ్రామ రైతులు తిప్పా రెడ్డి, రామచంద్రా రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.